సాక్షి కరీంనగర్

శనివారం | 11 | నవంబర్ | 2023

మీకు తెలుసా?

అభ్యర్థులు బస్సు చార్జీలకూ చేయిచాచే వారట!



మంథని: ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం ప్రస్తుత అభ్యర్థులు తాయిలాలు ఆశ చూపుతున్నారు. కానీ, గతంలోని అభ్యర్థులు బస్సు చార్జీల కోసం ఓటర్ల వద్ద చేయిచాచేవారట. 1972లో మంథని అసెంబ్లీ నుంచి తెలంగాణ ప్రజా సమితి అభ్యర్థిగా పోటీ చేసిన ఈవీ పద్మనాభం ఇలాగే తమ నుంచి ఓట్లతోపాటు బస్సు చార్జీలు అభ్యర్థించేవారని ఓటర్లు గుర్తుచేసుకుంటున్నారు.

మనోళ్లూ సిరిమంతులే..



- రూ.96.71 కోట్లతో నిజామాబాద్ ఎంపీదే అగ్రస్థానం
- తర్వాతి స్థానాల్లో పాడి కౌశిక్‌రెడ్డి, కె.సంజయ్
- ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఆస్తుల వివరాలు వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల పర్వం పూర్తయింది. ఎన్నికల సంఘానికి అభ్యర్థులు తమ అఫిడవిట్లు అందజేశారు. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్‌లలో వెల్లడించిన ఆస్తుల వివరాల ప్రకారం.. కోరుట్ల నుంచి పోటీ చేస్తున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.96.71 కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. తర్వాతి స్థానాల్లో హుజూరాబాద్ నుంచి పోటీ చేస్తోన్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి, కోరుట్ల అభ్యర్థి డాక్టర్ కె.సంజయ్ నిలిచారు.



ముగిసిన నామినేషన్లు..

12 నియోజకవర్గాల్లో మొత్తం 329 మంది బరిలో ఉన్నారు. వీరంతా 605 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గరిష్ఠంగా జగిత్యాలలో 58 మంది అభ్యర్థులు పోటీ పడుతూ.. 102 సెట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. తర్వాతి స్థానంలో హుజూరాబాద్ నిలిచింది. చివరి స్థానంలో చొప్పదండి, ధర్మపురి ఉన్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులందరూ ఇక ప్రచారంపై దృష్టిసారించనున్నారు.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, నామినేషన్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం అభ్యర్థులు	నామినేషన్లు
కరీంనగర్	23	35
చొప్పదండి	18	37
మానకొండూర్	20	42
హుజూరాబాద్	33	62
సిరిసిల్ల	23	43
వేములవాడ	22	39
పెద్దపల్లి	30	59
రామగుండం	31	51
మంథని	28	48
జగిత్యాల	58	102
కోరుట్ల	25	50
ధర్మపురి	18	37
మొత్తం	329	605

కరీంనగర్:
గంగుల కమలాకర్: రూ.25.50 కోట్లు
బండి సంజయ్: రూ.42 లక్షలు

చొప్పదండి:
రవిశంకర్ రూ.1.7 కోట్లు
మేడిపల్లి సత్యం: రూ.2.10 కోట్లు
బొడిగె శోభ: రూ.1.78 కోట్లు

మానకొండూరు:
కవ్వంపల్లి సత్యనారాయణ: రూ.7.88 కోట్లు
రసమయి బాలకిషన్: రూ.2.63 కోట్లు
ఆరెపల్లి మోహన్: రూ.41.21 లక్షలు

హుజూరాబాద్:
పాడి కౌశిక్‌రెడ్డి: రూ.51.36 కోట్లు
వొడితెల ప్రణవ్: రూ.9.63 కోట్లు
ఈటల రాజేందర్: రూ.12.12 కోట్లు

సిరిసిల్ల:
కె.తారకరామారావు: రూ.11.34 కోట్లు
కేకే.మహేందర్‌రెడ్డి: రూ.8.36 కోట్లు
రాణీరుద్రమ: రూ.1.18 కోట్లు

వేములవాడ:
చల్మెడ లక్ష్మీనరసింహారావు : రూ.26.39 కోట్లు
చెన్నమనేని వికాస్‌రావు : రూ.7.01 కోట్లు
ఆది శ్రీనివాస్: రూ.1.14 కోట్లు

జగిత్యాల:
ఏలేటి జీవన్‌రెడ్డి : రూ.2.93 కోట్లు
డాక్టర్ సంజయ్: రూ.11.09 కోట్లు
భోగ శ్రావణి: రూ.49.13 లక్షలు

కోరుట్ల:
ధర్మపురి అర్వింద్: రూ.96.71 కోట్లు
కల్వకుంట్ల సంజయ్: రూ.40.44 కోట్లు
జువ్వాడి నర్సింగరావు: రూ.15.13 కోట్లు

ధర్మపురి:
కొప్పుల ఈశ్వర్ : రూ.1.06 కోట్లు
అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ : రూ.12 లక్షలు

పెద్దపల్లి:
దాసరి మనోహర్‌రెడ్డి: రూ.32.72 కోట్లు
విజయరమణారావు: రూ1.16 కోట్లు
దుగ్యాల ప్రదీప్‌రావు: రూ.1.09 కోట్లు

మంథని:
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు : రూ.3.17 కోట్లు
పుట్ట మధుకర్ : రూ.1.04 కోట్లు
సునీల్‌రెడ్డి : రూ.3.89 కోట్లు

రామగుండం:
కోరుకంటి చందర్ : రూ.46.29 లక్షలు
రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్: రూ.1.16 కోట్లు
కందుల సంధ్యారాణి : రూ.11.65 లక్షలు

న్యూస్‌రీల్

బల్దియాలో స్వచ్ఛ్ దివాళి



కరీంనగర్ కార్పొరేషన్: ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ్ దివాళి, శుభ్ దివాళి ఘనంగా నిర్వహించారు. కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దీపాలు వెలిగించారు. అనంతరం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు సైతం కరీంనగర్ ఎంసీకే పేరుతో దీపాలను వెలిగించి దీపోత్సవం చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ ఫ్లెక్సీలు ప్రదర్శించి అవగాహన చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు, ఈఈ మహేందర్, డీఈలు ఓం ప్రకాశ్, వెంకటేశ్వర్లు, ఆర్వో ఆంజనేయులు, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామి పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం



కరీంనగర్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ విసిరిన సవాల్‌కు సిద్ధంగా ఉన్నామని, బహిరంగ చర్చకు వేదిక, సమయం నిర్ణయిస్తే తాము రావడానికి రెడీ అని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలో మాట్లాడుతూ.. మంత్రి గంగులను అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని బండి సంజయ్ కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. నాలుగున్నరేళ్లుగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కానీ, అసెంబ్లీ నియోజకవర్గానికి కానీ సంజయ్ చేసిందేమి లేదన్నారు. ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రధాని మోడీతో ఉన్న చనువుతో వేల కోట్ల నిధులు తీసుకవస్తారని ఆశించామని, అందుకు భిన్నంగా ఎంపీ గ్రాంటు రూ.90లక్షలు తప్పా ఒక్క రూపాయి కేటాయించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రతిపాదనల మేరకే మంజూరయ్యాయన్న విషయం తెలుసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌ను, మంత్రి కమలాకర్‌ను విమర్శించే అర్హత సంజయ్‌కి, పురుమల్ల శ్రీనివాస్‌కి లేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

పత్తి మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ప్రకటించారు. శని, ఆది సాధారణ, సోమవారం దీపావళి సందర్భంగా సెలవు ఉంటుందని యార్డు కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ వెల్లడించారు. మంగళవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని అన్నారు. కాగా.. మార్కెట్లో శుక్రవారం క్వింటాల్ పత్తి గరిష్ఠంగా రూ.6,850 పలికింది. 119వాహనాల్లో 1,163 క్వింటాళ్ల కొత్తపత్తిని రైతులు తెచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,000 పలికింది. గన్నీసంచుల్లో 45 మంది 99క్వింటాళ్లు తెచ్చారు. గరిష్ఠ ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.5,800కు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేశారు. మార్కెట్‌లో ఏడుగురు రైతులకు చెందిన 52.05 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ. 6,809లు పలికింది.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతాం



ఎన్నికల ప్రచారంలో గదను చూపుతున్న మంత్రి గంగుల కమలాకర్

- కరీంనగర్ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కొత్తపల్లి: కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతామని కరీంనగర్ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని 36,53,54 డివిజన్లలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటేయాలని, మరో ఐదేళ్లు సేవకుడిలా పని చేస్తానని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో చిచ్చుపెట్టి కేసీఆర్‌ను ఓడించి హైదరాబాద్‌ను ఆంధ్రాలో కలిపేందుకు అక్కడి నాయకులు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే కిరణ్‌కుమార్‌రెడ్డి, కేవీపీ, షర్మిల, పవన్ కల్యాణ్ బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో హైదరాబాద్‌లో అడ్డా వేశారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ఓటు వేస్తే భవిష్యత్ తరాల నోట్లో మట్టి కొట్టినట్లే అవుతుందన్నారు. మంత్రి గంగులకమలాకర్‌కు మద్దతుగా 35వ డివిజన్ లో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి ప్రచారం చేపట్టారు.

కమాన్‌పూర్, బద్దిపల్లిలో..

కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, బద్దిపల్లి గ్రామాల్లో మంత్రి కమలాకర్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, ఏఎంసీ చైర్మన్ మధు, వైస్‌చైర్మన్ రాజశేఖర్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీజేపీ నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి, నగునూర్, కిసాన్‌నగర్, శర్మనగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ యువకులు మంత్రి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. 14వ డివిజన్ కొత్త జైపాల్‌రెడ్డి మిత్రబృందం నుంచి శ్రావణ్ పటేల్ ఆధ్వర్యంలో 300 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, శ్రీదేవి, షేక్‌ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల చరిత్రను బేరీజు వేయండి



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

- శక్తికేంద్ర ఇన్‌చార్జిల సమావేశంలో బండి సంజయ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్రను బేరీజు వేసుకుని తీర్పు ఇవ్వాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ కష్టాల్లో అండగా ఉంటున్నదెవరో, అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూకబ్జాలు, అక్రమ దందాలతో రూ.కోట్లు దండుకున్నదెవరో ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. శుక్రవారం రాత్రి ఎంపీ కార్యాలయంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సంజయ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్ర, గుణగణాలపై ప్రజల్లో చర్చ జరిగేలా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని సూచించారు. తనను ఎంపీగా గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులతోపాటు అన్నివర్గాల ప్రజల పక్షాన చేసిన పోరాటాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎంపీగా గెలిపిస్తే ఏనాడూ ఖాళీగా కూర్చోలేదని, నిద్రాహారాలు మాని జనం కోసం పనిచేశానని చెప్పారు. కేసీఆర్ సర్కార్‌పై రాజీలేని పోరాటం చేయడంతోపాటు ప్రజలకు అండగా నిలబడ్డాడననే తృప్తి ఉందని అన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు చేసిందేమీ లేదంటూ ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే తొలి ఏడాది కరోనాతోనే గడిచిపోయిందని, మిగిలిన మూడున్నరేళ్లలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల కోసం ఏకంగా రూ.8వేల కోట్ల పైచిలుకు నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం నయాపైసా పనిచేయకపోయినా గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. కేంద్ర నిధులతో జరుగుతున్న పనులను సైతం బీఆర్ఎస్ చేసినట్లుగా సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. కరీంనగర్ ఎంపీగా తాను ఎన్ని నిధులు తీసుకొచ్చాననే అంశంపై గణాంకాలతో బుక్‌లెట్ సిద్ధం చేసి ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించండి


- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



కరీంనగర్ అర్బన్/మానకొండూర్: శాసన సభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ముగియగా కరీంనగర్, మానకొండూర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాలను పరిశీలించారు. నామినేషన్ వివరాలు, వాటితో దాఖలు చేసిన పత్రాల వివరాలను గురించి ఆర్వోలు కుందారపు మహేశ్వర్, లక్ష్మీకిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌లను పరిశీలించి నిర్వర్తించాల్సిన పనులను ఎప్పటికప్పుడే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అభిషేక్ మహంతి



గంగాధర/రామడుగు/కరీంనగర్‌క్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. శుక్రవారం రామడుగు, గంగాధర పోలీస్‌స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నేరస్తులు, రౌడీషీటర్లు, రెండు మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో గొడవలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఓటర్లను ప్రభావితం చేసిన వ్యక్తులపై నిఘా పెంచాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని బైండోవర్ చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. సీపీ వెంట చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎస్సైలు అభిలాష్, తోట తిరుపతి ఉన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ

చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని వెలిచాల క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం సీపీ అభిషేక్ మహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అక్రమ తరలింపులను గుర్తించినట్లయితే వాటిని సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ చేయించాలన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి



- టీఎన్జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్

కరీంనగర్ అర్బన్: ప్రతీ ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకోవాలని టీఎన్జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో కరీంనగర్ జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ సమావేశం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి ఓటుహక్కు వినియోగం, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతీ ఉద్యోగి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడమే కాకుండా తోటి ఉద్యోగులతో, వారి కుటుంబ సభ్యులతో ఓటు వేయించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. ఎలక్షన్ విధులకు హాజరయ్యే ఉద్యోగులందరూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ పోస్టల్ బ్యాలెట్‌ను సకాలంలో రిటర్నింగ్ అధికారికి అందజేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా కానీ సోషల్ మీడియాలో, వాట్సాప్‌లలో పోస్టులు చేయకూడదని అన్నారు. టీఎన్జీవోల కేంద్ర సంఘం మాజీ అధ్యక్షుడు స్వామినాథన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు, సన్నద్ధ కార్యక్రమంపై చర్చించారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్స్.. నో రూల్స్

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు
- పక్కనే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం
- ఇంటర్ విద్యాశాఖ అనుమతి ఉందన్న ప్రిన్సిపాల్
- నగరపాలక సంస్థ అనుమతి ఇవ్వలేదన్న డీసీపీ



ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో హోర్డింగ్

కరీంనగర్ కార్పొరేషన్ : ఇక్కడ నిబంధనలు పట్టవు. ప్రజల ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా అధికారులకు పట్టదు. అనుకూలమైన సైట్ కనిపించిందా.. డబ్బులు కుమ్మరీయడం.. అనుమతుల కోసం కూడా ఆగకుండా నిర్మాణాలు చేపట్టడం.. నగరపాలకసంస్థ పరిధిలో సర్వసాధారణంగా మారింది. కొంతమంది పట్టణ ప్రణాళిక అధికారుల అవినీతి సాక్షిగా నగరంలో హోర్డింగ్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ఆవరణలో నగరపాలకసంస్థ అనుమతి లేకుండా హోర్డింగ్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం దాదాపు పూర్తి కాగా, బోర్డు బిగించడమే మిగిలింది. కళాశాల ప్రహరీని అనుకొని లోపలి వైపు భారీస్థాయిలో ఈ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రహరీకి ఇవతలి వైపు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ పోల్ (టవర్) ఉన్నాయి. కనీసం పదడుగుల వ్యత్యాసం కూడా లేకుండా ట్రాన్స్‌ఫార్మర్, హోర్డింగ్‌లు ఉండడంతో భవిష్యత్‌లో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇలా నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్ పెట్టడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే నగరపాలకసంస్థ అనుమతి లేకున్నా హోర్డింగ్ ఏర్పాటు చేయడం, పదిహేను రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలోని కొంతమంది అధికారుల సహకారంతోనే ఈ తతంగం నడుస్తుందనే ఆరోపణలున్నాయి. ఏదేమైనా ప్రభుత్వ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా హోర్డింగ్ నిర్మించడం అధికారుల పనితీరుకు తాజా తార్కాణం.

అనుమతి లేదు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌కు నగరపాలకసంస్థ తరఫున ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నందున దీనిని పట్టించుకోలేకపోయాం. వెంటనే పరిశీలిస్తాం.

– సుభాష్, డిప్యూటీ సిటీ ప్లానర్

తీసుకున్నాం..

కళాశాల ఆదాయం పెంచేందుకు హోర్డింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ అనుమతి కూడా తీసుకున్నాం. వచ్చిన కొటేషన్లను పరిశీలించి ఎంపిక చేశాం. ట్రాన్స్‌ఫార్మర్ సంగతి మున్సిపల్ వాళ్లు చూసుకుంటారు.

– రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

క్లుప్తంగా

'అల్ఫోర్స్'లో అకౌంటింగ్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రొఫెసర్ హరికాంత్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అకౌంటింగ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.హరికాంత్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బి.కృష్ణారెడ్డిలు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, బి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ముందస్తు దీపావళి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి లక్ష్మీదేవికి పూజలు చేసి, విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. టీచర్లు పిల్లలతో కలిసి బాణాసంచా పేల్చి, సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, డీన్ విజయ్ కృష్ణ, కో–ఆర్డినేటర్లు ప్రవీణ్, విజయలక్ష్మి, మమత, కృష్ణవేణి, ఏవో జ్యోతి పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పట్టణానికి చెందిన అంకాలపు స్వరూప(47) పెళ్లి కాలేదు. దీనికితోడు అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది, గురువారం రాత్రి చేదబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలి సోదరుడు కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నలుగురిపై నిబంధనల ఉల్లంఘన కేసు

మానకొండూర్: ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం మానకొండూర్‌లో నామినేషన్ వేశారన్నారు. అయితే, ఆయన 350 మందితో ర్యాలీగా వెళ్లి, నామినేషన్ వేస్తానని అధికారుల అనుమతి తీసుకొని, 3 వేల మందితో వెళ్లారని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ జామ్ అయ్యిందని, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకే కవ్వంపల్లి సత్యనారాయణ, తిమ్మాపూర్, మానకొండూర్ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, నందగిరి రవీంద్రాచారి, ర్యాలీకి అనుమతి తీసుకున్న మురళీమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పట్టుకున్న సొమ్ము సామాన్యులదే

- జిల్లాలో రూ.3.84 కోట్లు స్వాధీనం
- రూ.10 లక్షల వరకు పర్యవేక్షణ కమిటీదే నిర్ణయం
- అంతకు మించితే ఆదాయ పన్నుశాఖకు సమాచారం

తనిఖీలతో నియోజకవర్గాల వారీగా పట్టుబడిన నగదు (రూ.ల్లో)

నియోజకవర్గం	నగదు	విడుదల	బంగారం
కరీంనగర్	3,25,52,726	3,25,52,726	0
హుజూరాబాద్	23,74,780	22,63,690	0
చొప్పదండి	7,68,900	6,34,600	102.83గ్రా
మానకొండూరు	12,37,570	10,22,570	0

కరీంనగర్ అర్బన్: శాసనసభ ఎన్నికల క్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ఇప్పటివరకు పట్టుకున్న సొమ్ము దాదాపు సామాన్యులదే. వ్యాపారాలు, ఇతరత్రా అవసరాలకు తరలిస్తున్న నగదు, బంగారాన్ని పట్టుకోగా జిల్లాలో వివిధ తనిఖీల ద్వారా రూ.3.84కోట్లు స్వాధీనం చేసుకున్నారు. సదరు సొమ్మును విడుదల చేయగా, ఆదాయపు పన్నుశాఖకు అప్పగించింది ఒక్క కేసు లేదు. పట్టుకున్న సొమ్ము విడుదల, జప్తు వంటి అధికారాలకు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ప్రత్యేక కమిటీని నియమించింది. కమిటీ ఎన్నికల నిబంధనల మేరకు పర్యవేక్షిస్తోంది. ప్రధాన రహదారులపై పోలీసులతోపాటు నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. పెద్దఎత్తున డబ్బు చిక్కితే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఒకవేళ లెక్కపత్రాలు సరిగా ఉంటే మాత్రం వెంటనే విడిచిపెట్టేందుకు ఆస్కారముంది. ఎక్కడైనా డబ్బు పట్టుకుంటే తప్పనిసరిగా నియమిత కమిటీ దృష్టికి తీసుకొచ్చేలా ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ) అమలు చేస్తున్నారు.

వాహన తనిఖీలు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ వాహనాలు తనిఖీలు చేస్తున్నాయి. ఒకవేళ వాహన తనిఖీల్లో రూ.50వేలకు మించి దొరికితే.. ఆధారాలు చూపించాలని అడుగుతున్నారు. ఈ బృందాలతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైతం నిఘా తీవ్రతరం చేశాయి. ఈ అక్రమ తరలింపు వ్యవహారంలో కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది దారి తప్పే



కలెక్టరేట్‌లోని కమిటీ కార్యాలయం

అవకాశముందనే ప్రచారం నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పర్యవేక్షణ కమిటీని నియమించింది. క్షేత్రస్థాయి తనిఖీ బృందాలు గనక పెద్ద ఎత్తున డబ్బు పట్టుకుంటే.. ఆధారాలు సరిగానే ఉన్నాయని సత్వరమే విడిచిపెట్టే అవకాశం లేదు. తప్పనిసరిగా డబ్బును పట్టుకున్న విషయాన్ని కమిటీ దృష్టికి తీసుకురావాల్సిందే.

రూ.10 లక్షలు దాటితే ఐటీకి

పట్టుకున్న సొమ్ము విలువ రూ.10లక్షల వరకు ఉంటే కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. లెక్కాపత్రాలు సరిగా ఉంటే వదిలి పెట్టనున్నారు. ఒకవేళ లెక్కాపత్రం సరిగా ఉన్నా సరే రూ.10 లక్షల కన్నా ఎక్కువ సొమ్ము తరలిస్తుంటే మాత్రం కమిటీ తప్పనిసరిగా ఆదాయ పన్నుశాఖ నోడల్ అధికారికి సమాచారం అందిస్తున్నారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ యంత్రాంగం.. సదరు వ్యక్తులకు తాఖీదులు జారీ చేస్తోంది. వివరణ సంతృప్తికరంగా ఉంటే పర్వాలేదు. లేకుంటే మాత్రం లెక్క ప్రకారం పన్ను మినహాయించుకొని తిరిగి ఇవ్వనున్నారు.

పర్యవేక్షణ కమిటీలో వీరు..

నోడల్ అధికారి: డీఆర్డీవో శ్రీలతారెడ్డి
కన్వీనర్: డీసీవో రామానుజాచార్య
సభ్యులు: నాగరాజు, ఆడిట్‌శాఖ అధికారి

సుమోటోగా విచారణ

ప్రస్తుతం రూ.50వేల కన్నా ఎక్కువ మొత్తంలో డబ్బు తరలిస్తూ తనిఖీ బృందాలకు చిక్కితే ఆ డబ్బు ఎక్కడిదని ఆరా తీస్తున్నారు. ఆ వివరాల్ని వెంటనే రిటర్నింగ్ అధికారితోపాటు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. ఒకవేళ పత్రాలు సరిగా ఉండి.. ఆ డబ్బు ఎన్నికల వ్యవహారంతో సంబంధం లేనిదేనని కచ్చితంగా నిర్ధారించుకుంటే మాత్రమే స్థానిక రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తున్నారు. ఏమాత్రం అనుమానమొచ్చినా కమిటీ సుమోటోగా ఆ వ్యవహారంపై విచారణ జరపనుంది. ఆ తరహా సంఘటనల గురించి రోజువారీ నివేదికలు రూపొందించనుంది. ఒకవేళ సొమ్మును జప్తు చేస్తే మాత్రం అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం ఇస్తోంది. ఎవరికి అప్పీలు చేసుకోవాలనే విషయాన్ని డబ్బు తరలిస్తున్న వ్యక్తులకు తెలియజేస్తోంది.

వీడియో డిలీట్ చెయ్‌రా ఫస్ట్

- నువ్వు చౌరస్తా కాడికి రా..
- అధికార పార్టీ నేత బంధువు బూతు పురాణం
- ఇసుక అక్రమ తరలింపుపై లొల్లి
- సిరిసిల్లలో ఆడియో, వీడియో వైరల్

సిరిసిల్లటౌన్: నువ్వు వీడియో డిలీట్ చెయ్‌రా ఫస్ట్.. ఏడున్నవ్ నువ్వు.. చౌరస్తా కాడికి రా.. అంటూ ఓ అధికార పార్టీ నేత తమ్ముడు ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమిశెట్టి దశరథంకు బెదిరింపు కాల్ చేయడం శుక్రవారం సిరిసిల్లలో వైరలయ్యింది. బాధితుడు విలేకరులతో తన గోడు వెలిబుచ్చాడు. సిరిసిల్ల పట్టణంలో గురువారం రాత్రి 9.30 గంటలకు పట్టణానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ ప్రముఖ నేత తమ్ముడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడు. పర్మిట్ లేని ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లడాన్ని తాను ఫోన్‌లో వీడియో తీయగా.. శుక్రవారం ఉదయం తనకు ఫోన్ చేసి వీడియో నువ్వు ఎందుకు తీసినవ్.. వీడియో డిలీట్ చేయ్ అంటూ పరుష పదజాలంతో మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. సిరిసిల్ల మానేరు నుంచి ఎలాంటి వేబిల్లులు లేకుండానే రాత్రివేళలో ఇసుకను తరలించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని, బూతు పురాణం అందుకున్న అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ఆధారాలతో జిల్లా ఎస్పీ, డీఎస్పీ, టౌన్ సీఐలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఫోన్‌లో ఇరువురి సంభాషణ.. అధికార పార్టీకి చెందిన వ్యక్తి బెదిరింపులు.. తిట్లు.. 150 ట్రాక్టర్లు నడుస్తున్నయ్.. కేటీఆర్ పేరెందుకు తీస్తున్నవ్ అంటూ సాగిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరలవడం ప్రజల్లో చర్చనీయాంశమైంది.

మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం





బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు, మద్యం బాటిళ్లు చూపుతున్న సీఐ లక్ష్మీనారాయణ

జగిత్యాలక్రైం: మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామ శివారులో నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని అతడి వద్ద 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని విచారించగా.. నాటుసారా తయారు చేసే కుర్మపల్లి, సారంగాపూర్ మండలం రంగపేట గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లోని ప్రదేశాలకు వెళ్లి 20 కిలోల స్పటిక, 50 కిలోల నల్లబెల్లాన్ని సీజ్ చేయడంతో పాటు 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని అన్నారు. జగిత్యాల జిల్లా పరిధిలో మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించినా, నాటుసారా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సై రవి, సిబ్బంది రమేశ్, వీరయ్య, సంతోష్ పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తి గ్రామంలో బెల్ట్ దుకాణంపై మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. రాజు అనే వ్యక్తి అక్రమంగా అనుమతి లేకుండా బెల్ట్ దుకాణం నిర్వహిస్తుండగా.. రూ.20వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రాజేందర్, పోలీస్ కానిస్టేబుల్ పవన్, కిరణ్, సంతోష్ పాల్గొన్నారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్ మృతి



వెంకటేశ్వరస్వామి (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): మండల పరిషత్ సూపరింటెండెంట్ శఠగోపపు వెంకటేశ్వరస్వామి(55) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేశ్వరస్వామి 2019లో మల్లాపూర్ మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందాడు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వెంకటేశ్వరస్వామి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనకు భార్య మమత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కువైట్‌లో బండపల్లి యువకుడు..



బాబు (ఫైల్)

చందుర్తి(వేములవాడ): జీవనోపాధికి గల్ఫ్ దేశం పయనమైన ఓ యువకుడు జ్వరంతో మరణించాడు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రేగుల బాబు(36) అనే యువకుడు 11నెలల క్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. 20రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నట్లు అతడి స్నేహితులు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. గదిలో ఉన్న బాబు శుక్రవారం ఉదయం తలనొప్పిగా ఉందని చెప్పి కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, కూతురు(11), కుమారుడు(13) ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని కోరుట్లపేటకు చెందిన సడిమెల సాయి తన బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆటో వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సాయిని స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ యువకుడిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి..

ధర్మపురి: బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాలకు చెందిన సంజయ్ అనే యువకుడు శుక్రవారం మంచిర్యాల నుంచి జగిత్యాలకు వెళ్తుండగా.. ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లె సమీపంలో వాహనం అదుపుతప్పి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఎంటీ అనిల్‌కుమార్ ప్రథమ చికిత్స చేసి వెంటనే 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సింగరేణి కార్మికుడి దుర్మరణం



శ్రీనివాస్ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): స్థానిక పిల్లపల్లె వద్ద గురువారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గుండారం గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు లక్కాకుల శ్రీనివాస్(55) శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రావణ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. శ్రీనివాస్ కమాన్‌పూర్ నుంచి గుండారం వస్తుండగా మసీదులో మౌలానా పనిచేస్తున్న రహ్మత్ అలీ గుండారం నుంచి కమాన్‌పూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాములు కేసు నమోదు చేసుకున్నారు.

తమ్ముడి భార్యపై గొడ్డలితో దాడి



గాయపడిన లత

కొండగట్టు(చొప్పదండి): భూతగదాల నేపథ్యంలో సొంత తమ్ముడి భార్యపై అన్న దాడి చేసిన సంఘటన కొడిమ్యాల మండలం రాంసాగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవీందర్‌రావు, సత్యంరావు అన్నదమ్ములు. కొన్ని సంవత్సరాల క్రితం సత్యంరావు మృతిచెందగా.. అతడి భార్య లత, అన్న రవీందర్‌రావు మధ్య భూతగదాలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో శుక్రవారం పొలం వద్ద జరిగిన గొడవల్లో రవీందర్‌రావు, అతడి కుమారుడు రామేశ్వర్‌రావు లతపై గొడ్డలితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన లతను కుటుంబ సభ్యులు జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. లత కొండగట్టు ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వరికోతలు.. పెళ్లిళ్లు.. ప్రచారం

- ఈ నెల అందరికీ కీలకం

కరీంనగర్‌రూరల్: నవంబర్ నెల అందరికీ కీలకంగా మారింది. ఈ నెలలోనే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు, వానాకాలం సీజన్ వరికోతలు, వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే రైతులు వరికోతలు చేపట్టి, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల గడువు శుక్రవారం ముగిసింది. ఈ నెల 15 నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేపట్టనున్నారు. అయితే, ఈ నెలలోనే ఎక్కువగా పెళ్లిళ్లు జరుగుతుండటంతో ప్రచారంతోపాటు పోలింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 16, 18, 24, 28, 29 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. దీంతో అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఫంక్షన్ హాళ్లలో సందడి చేయనున్నారు. గతంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు పెళ్లికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు ఇచ్చినప్పటికీ పనుల ఒత్తిళ్ల సాకుతో గైర్హాజరయ్యేవారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తప్పనిసరిగా వివాహాలకు హాజరవుతారు. ఫలితంగా విందు ఖర్చు భారీగా పెరుగుతుందని నిర్వాహకులు అంటున్నారు. ఈ నెల 29న పెళ్లి ఉంటే మరుసటి రోజు పోలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. బంధువులు, మిత్రులు రాకతో ఓటింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతాయేమోనని అభ్యర్థులు కలవరపడుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలపై కార్యకర్తలతో అంతర్గతంగా చర్చిస్తున్నారు.

పదేళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి
- బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న హరిశంకర్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీల నాయకులు అభివృద్ధిపై మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఎంపీ బండి సంజయ్‌తో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సమయం, వేదిక చెబితే వస్తానని తెలిపారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన కరీంనగర్ నియోజకవర్గానికి తెచ్చిన నిధుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మాయమాటల ఎంపీ సంజయ్, భూకబ్జాల పురమల్ల శ్రీనివాస్ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో నిలిచారని, ఓటమి ఖాయమని గ్రహించే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, షౌకత్ అలీ, నారదాసు వసంత్‌రావు, రాజు, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళలను వెలికితీసేందుకే కళోత్సవాలు



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ కల్చరల్: విద్యార్థుల్లో దాగివున్న విభిన్న కళలను వెలికితీసేందుకే ఏటా కళోత్సవాలు నిర్వహిస్తున్నామని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులకు విద్యతోపాటు కళలు అవసరమని, అవి మానసిక, శారీరక కోల్లాసానికి ఉపకరిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమ అనుసంధానకర్త సీహెచ్.జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 10 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలైన ఒక బాలిక, ఒక బాలుడిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. న్యాయనిర్ణేతలుగా కేబీ శర్మ, కేఎస్.అనంతాచార్య, మంజుల, రతన్‌కుమార్, రాధాకృష్ణ, సూర్యశ్రీ, ఆర్‌ఎస్ నంద, సత్యనారాయణ వ్యవహరించారు. డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశీకుమార్, మండల విద్యాధికారి మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఓ యువతికి ఉద్యోగం ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడి రూ.1.70 లక్షలు కాజేశారు. విద్యానగర్ ప్రాంతానికి చెందిన భూపతి చరణ్ సోదరి ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఇటీవల ఉద్యోగం కోసం చూస్తుండగా.. ఓ యాప్ ద్వారా టీసీఎస్ కంపెనీలో ఉద్యోగం ఉన్నట్లు తెలుసుకొని సంప్రదించింది. బీమిలికి చెందిన అభిషేక్ వర్మ అనే వ్యక్తి నకిలీ అడ్రస్ పెట్టి ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించాడు. యువతి తన సోదరుడికి చెప్పడంతో ఆ వ్యక్తిని సంప్రదించగా.. సంవత్సరానికి రూ.16 లక్షల ప్యాకేజీ ఇప్పిస్తానని నమ్మించాడు. దశలవారీగా సైబర్ నేరగాళ్లకు రూ.1.70 లక్షలు చెల్లించారు. డబ్బులు చెల్లించిన తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన కల్పించండి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలతారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలతారెడ్డి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో గల మహిళలు, ఉపాధి హామీ కూలీలకు ఓటరు అవగాహన కల్పించి పోలింగ్‌శాతం పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలతారెడ్డి ఏపీయం, ఏపీవోలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీఆర్డీఏ సిబ్బంది కోసం ఓటరు అవగాహన ఫోరంను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సెర్ప్ సిబ్బంది మహిళా సంఘాలకు, ఈజీఎస్ సిబ్బంది ఉపాధి కూలీలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కోడ్ ఉల్లంఘనపై టోల్ ఫ్రీ నంబర్ 1950, సీ విజిల్ యాప్‌ల వినియోగం గురించి విస్తృత ప్రచారం చేయాలని కోరారు. స్వీప్ నోడల్ అధికారి రవీందర్, అదనపు డీఆర్డీవో సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, అంబుడ్స్‌పర్సన్ లక్ష్మీనారాయణ, డీపీఎంలు పాల్గొన్నారు.

పార్టీల జెండాల తయారీపై నిఘా

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్లలో తయారయ్యే వివిధ రాజకీయ పార్టీల జెండాలు, కండువాలపై ఎన్నికల కమిషన్ నిఘా వేసింది. సిరిసిల్లతోపాటు హైదరాబాద్‌లోని జెండాలు, కండువాలు, టోపీల తయారీ కేంద్రాల్లో రెండు రోజులపాటు తనిఖీలు నిర్వహించారు. ఏ రాజకీయపార్టీ అభ్యర్థులు ఎన్ని జెండాలు.. ఎన్ని కండువాలు, ఎన్ని టోపీలకు ఆర్డర్లు ఇచ్చారో.. అంత మేరకు బిల్లులు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ప్రచార సామగ్రిని సరఫరా చేసి, తక్కువ సంఖ్యలో బిల్లులు ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ అధికారుల బృందం సైతం సిరిసిల్ల వస్త్రవ్యాపారులు సరఫరా చేసే తెల్లని పాలిస్టర్ బట్టకు జీఎస్టీ చెల్లిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. సిరిసిల్లకు చెందిన ప్రముఖ వస్త్రవ్యాపారి ధ్యావనపల్లి మురళికి చెందిన గోదాముల్లో తనిఖీలు చేసి ఈమేరకు అధికారులు ఆరా తీశారు. ఉత్పత్తి అవుతున్న జెండాలు, కండువాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఎన్నికల కమిషన్ అధికారులు, జీఎస్టీ అధికారులు సిరిసిల్ల, హైదరాబాద్‌లలో తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశమైంది.

పుస్తెలతాడు చోరీకి విఫలయత్నం

ధర్మపురి: ధర్మపురిలోని తోట్లవాడకు చెందిన ఒజ్జ నర్సవ్వ అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం పిండి పట్టించేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. ధర్మపురిలోని దేవాలయం వెనక భాగానున్న సందులో ఇద్దరు గుర్తుతెలియని వక్తులు బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అయితే ఆమె పుస్తెల తాడు చోరీకి గురైందని భావించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల తనిఖీలో పుస్తెల తాడు సంఘటన స్థలంలోనే దొరికింది. పుస్తెల తాడు రెండున్నర తులాలుంటుందని బాధితురాలు తెలిపింది.

వాహనాల తనిఖీ



మంథని: ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. అంతకుముందు చెక్‌పోస్టులో తనిఖీలు చేశారు. పెద్దపల్లి డీటీఎఫ్ వినోద్ రాథోడ్, సీఐలు గురువయ్య, విజయ్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, సాయిరాం తదితరులు ఉన్నారు.

ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!



ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధనత్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్టెటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...

బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది.

తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి.

వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ–కాఫీ మరకలు

టీ–కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.



సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

వేటాడే సత్యభామ



● కాజల్

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

రెండు హృదయాల కల



● జాన్వీ కపూర్

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు..



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.



● 'ది ట్రయల్' పోస్టర్

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్

''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.

